# ఎలెక్షన్ సప్లై కంపెనీ లిమిటెడ్

## మూలధనం, రు. 100,000 లు.

వాటా 1-కి 10 రూపాయలు — 10,000 వాటాలక్రింద విభజింపబడినది.

---

## ఇప్పటికప్పుడే 6,500 వాటాలు వసూలైనవి.

**మేనేజింగ్ డైరక్టర్**

రా॥ సా॥ పచ్చాపకేశ చెట్టియార్,
లాటీ కంట్రాక్టర్ అండ్ బాంబూ మర్చెంట్.

**సెక్రటరీలు.**

జనాబ్ సయ్యద్ సుభానీ,
ప్రొప్రైటర్ కోడిగ్రుడ్ల కంపెనీ.

శ్రీ జీవరత్నామణిగారు
ప్రొప్రైటర్ జీవరత్నామణి బ్రదర్స్,
సెకండ్ హాండ్ షూ అండ్ బూట్ మార్ట్,
మూర్ మార్కెట్, మద్రాస్.

— సభ్యులు —

దీనదయాళు మొదలియార్ (అబ్కారీ కంట్రాక్టర్)

కె. వెంకటశాస్త్రి, శ్రోత్రియందార్.

ఆర్. సహస్ర భుజదాస్, బాంకర్.

అబ్దుల్ అన్వరుద్దీన్, టైలర్స్, అండ్ బూట్ ఫిటర్స్.

శిరోభూషణ వెంకటాచార్యులు, అనువంశీయ వైద్యులు.

**బ్యాంకర్సు**

**కారకినాడు బ్యాంక్ లిమిటెడ్.**

ఆశయములు:

మనదేశములో ప్రజాస్వామిక ప్రభుత్వవిధానము యిప్పటికప్పుడే చాలవరకు వ్యాప్తినందియున్న యీదిన ములలో ఎన్నికలుతరుచు జరుగుచూవుండడమును, ఆయా సమయములలో కావలసిన వస్తు సామగ్రి సరిగా లభ్యము కాకుండుటయు మహా కష్టముగావున్న అన్ని రాజకీయ పక్షనాయకులును పదేపదే వెళ్లబుచ్చియున్న కారణమున కంపెనీవారీ క్రొత్త అవకాశమును సద్వినియోగముచేయ నిశ్చయించారు.

పంచాయతీబోర్డు మొదలుకొని భారతశాసన సభ వరకుగల అన్నిరకములగు యెన్నికలకును పోటీచేయు వారికి అవసరమగు హంగామా కూర్చడమే కంపెనీయొక్క ప్రధానాశయము. నేడు దేశములో లెక్కలేనన్ని పార్టీలు బయలుదేరియున్న కారణమున కంపెనీ ప్రారంభము నుండియు మంచి వ్యాపారము చేయుటకు తగినన్ని అవ కాశములున్నవి.

ప్రాతసామగ్రి

కంపెనీ తరపున కొంతమంది యేజంట్లు మన రాజ ధానిలో అన్నిప్రాంతములను తిరుగుతూవుంటారు. ఆయా ప్రాంతములలో ఎన్నికలు, పార్టీసమావేశములు జరు గుతూవున్న సమయమున అక్కడ పార్టీ నాయకులకు కార్యనిర్వాహకులను కలసికొని వారికి వారికి కావలసిన పరికరములకు ఆర్డరు తీసికొంటూవుంటారు.

కంపెనీ తాలూకు మనుష్యులు పట్టణములకు పల్లె లకూ వెళ్ళి పాతచెప్పులు, చెడిపోయిన కోడిగ్రుడ్లు, చినిగి పోయిన పాత గ్రుడ్డపేలికలు, లాటీలు, పల్లేరుకాయలు, క్షురకర్మశాలలోని కత్తిరింపువెంట్రుకలు వగయిరా సామ గ్రిని మొత్తము మొత్తముగా సేకరించి జిల్లా బ్రాంచీ గిడ్డంగులలో నిల్వయుంచబడును. ఆర్డరు వచ్చినవెంటనే ఆయా పార్టీలకు సరఫరాచేయబడును.

ఉపన్యాసములు

కంపెనీ వందమంది ఉపన్యాసకులను తయారు చేస్తుంది. వీరు జస్టిస్, కాంగ్రెస్, సనాతనిస్టు, ప్రజాపక్షం, ప్రజామిత్రపక్షం, ముస్లిమ్‌పక్షం, డెమోక్రాటిక్‌పార్టీ; స్వతంత్రపక్షము మున్నగు పార్టీల ప్రాపగాండావిధాన ములు అన్నీ నేర్పబడుతవి. ఫలాని పార్టీవారు ఉపన్యాస కులు కావలెనని ఆర్డరుయిస్తే కంపెనీ ఉపన్యాసకులు అక్కడకువెళ్ళి ప్రచారముచేస్తారు.

శంఖారావబృందము

కంపెనీ తాలూకు శంఖారావబృందము వొకటి వుంటుంది. ఈ బృందములో 50 మంది వుంటారు. వీరంతా కృష్ణలీలలోని కంసునికన్న గట్టిగా పొలికేకలు వేయగలి గినవారే వుంటారు. ఎదురుపార్టీవారి మీటింగు జరుగ కుండా చేయాలంటే యీ యేబదిమందియు వెళ్ళి నక్క కూత, కుక్కకూతలు, పెద్దపులి గోండ్రింపులు, గాడిదల వోండ్రపులు, సింహ గర్జనలు చేస్తారు. ఆ భీమణ ఘీంకార ములలో సభ సాగదు. ఈ బృందమును "ఎమర్జన్సీగ్రూప్" క్రింద యిరువదినాలుగు గంటలుకు సిద్ధముగా వుంచ బడును.

వ్యాసకర్తలు

ఆయాపార్టీలకు తగిన ప్రచార వ్యాసరాజములను తయారుచేయుటకు కంపెనీ కొంతమంది హేమాహేమీ లను సిద్ధముగా వుంచుతుంది. యేయే పార్టీకి యెటువంటి వ్యాసములు కావాలో వారివారి అవసరములను తెలు పుతూ ఆర్డరుయిస్తే వాటిని సిద్ధముచేసి సప్లయి చేయ వచ్చును.

ఊరేగింపు

నాయకులు పార్టీలు యెక్కువ అయిన రోజులలో అయాచితముగ ఊరేగింపులు చేయడము, స్వాగతములు యీయడము అంటే మహా అరుదైపోయింది. ఎవరన్నా నాయకులు ఫలాని నగరమున స్వాగతపు టూరేగింపు యేర్పాటుచేయాలంటే అందుకు ముందుగా కంపెనీకి తెలియజేస్తే మనకంపెనీ ఉద్యోగులు కొందరు బ్యాండు, సన్నాయిమేళములతో తోరణములతో బాణాసంచాతో

పుష్పమాలతో, స్వాగతపత్రములతో అలంకరింపబడిన మోటారుతో స్టేషనువద్ద హాజరై ఊరేగింపు కోలాహలమును అత్యంత శోభావంతముగ కంపెనీ జరిగించును.

### పాతచెప్పులు వగయిరా సామగ్రి

కంపెనీకి 100 కి 50 వంతు లాభములు యీయగలశాఖ యీ పాతచెప్పులశాఖగా కంపెనీవారు విశ్వసిస్తున్నారు. కోడిగ్రుడ్ల కంపెనీ ప్రొప్రైటర్లు అనుభవశాలురు అయిన జనాబ్ సయ్యద్ సుభానిగారును అనువంశిక పాదరక్షావ్యాపారులు, ప్రస్తుతము మూర్ మార్కెట్‌లో కడుంగడు సమర్థతతో సెకండ్‌హాండ్ షూ అండ్ బూట్ మార్టును మూర్ మార్కెట్టులో నిర్వహిస్తూవుండిన శ్రీ జీవరక్షామణిగారును కంపెనీకి లభించినందుకు కంపెనీ మొత్తము గర్వపడుతూవున్నది. ఒకేవొక తిరుచినాపల్లి సమావేశమును 5 వందల జతల పాత పాదరక్షలకు జీవరక్షామణిగారు సరపరాచేయగలిగారంటే శ్రీవారియొక్క శక్తిసామర్థ్యములకు ప్రజాబాహుళ్యము గురుతింపవచ్చును.

తుపానుగాలితో ధారాపాతమైన వర్షముతో చెదరగొట్టలేని సభను,—నోరుమూయింపలేని ఉపన్యాసకునిచేత ఒకే ఒక పాతచెప్పు—ఒకే వొక చెడిపోయిన కోడిగ్రుడ్డుతో ఆశింపవచ్చునని నేటి పార్టీనాయకులంతా యెరుగుదురు. అందువలన యీ శాఖలవల్ల కంపెనీకి యెక్కువ లాభములు రాగలవని ఆశించడములో పొరపాటు యేమీలేదు.

ఆయాసమయములబట్టి కంపెనీలో క్రొత్త క్రొత్త శాఖలు చేర్చవలసివుంటే డైరెక్టర్లు ఆ యేర్పాటులు చేస్తారు.

ఈ ఉపయోగమైన యీ కంపెనీ వాటాలను జనబాహుళ్యము విరివిగాకొని కంపెనీ విజయవంతముగా సాగేలాగుచేసి మంచి లాభములను సంపాదించెదరు గాక!

వివరములకోసము కార్యదర్శులకు వ్రాయండి.

## నీవు కనుక

వీరుడవౌచూ పోరదలిస్తే
వీరస్వర్గమును పొందదలిస్తే
విశ్వనాథవారి
వేంగి గీతములు
కళ్ళను చూడాలీ
కరమున
కత్తిని పట్టాలీ.

మాతృదేశసేవ చెయ్యాలంటే
పేరుప్రతిష్టలు పొందాలంటే
రాయప్రోలాంధ్రా
రామపు గీతాల్
చక్కగ చదవాలీ
తెలుగుల
సారము తెలియాలీ.

దైవభక్తినే పొందకోరితే
దాసుడవౌచూ మూఅకోరితే
వ. సు. రామకవీ
శ్వరచింతా
మణిగీతాల్ చదువూ
హాను
మంతుని రీతిని మెలగూ.

ప్రేమ వార్నిధిలో యీదదలిస్తే
కాముకుండవై సుఖింపదలిస్తే
నాయనివారీ
తీయని గీతాల్
హాయిగ పాడాలీ
స్థాయిని పెంచాలీ.

ప్రేయసి కొరకై శోకిస్తావా?
వెఱ్ఱి వియోగిగా నటియిస్తావా?
కృష్ణశాస్త్రి కృష్ణ
పక్షపు గీతాల్
కనగానే కారూ
కళ్లని
కాల్వలుగా నీరూ.

—కొడాలి రాజా